నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
15 | హైదరాబాద్, శుక్రవారం 26 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఒకటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నీలగిరి, జనవరి 25 : వచ్చే నెల 1నుంచి 15వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియల్ విద్యాశాఖ అధికారి దస్రూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు స్పెల్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ విభాగంలో 83, ఒకేషనల్ విభాగంలో 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సైన్స్ ప్రయోగాల్లో 15,583 మంది, ఒకేషనల్ కోర్సులో ప్రథమ సంవత్సరం 1,486 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,318 మంది పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటిసారిగా ఆంగ్లంలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత సంవత్సరం రాయని వారికి, ఫెయిల్ అయిన వారికి ఎథిక్స్ మరియు హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్విరాన్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

పల్లె పగ్గాలు ప్రత్యేక అధికారులకేనా..?

జిల్లాలో స్పెషల్ ఆఫీసర్ల జాబితా సిద్ధం!

చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్‌తోనే పర్సన్ ఇన్‌చార్జీలకు సాధ్యం

సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. స్థానిక పోరు నిర్వహణ ఇప్పట్లో కష్టమని దాదాపు తేలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలన ఉంటుందా..? పర్సన్ ఇన్‌చార్జ్ పాలన అనేది స్పష్టత రావాల్సి ఉన్నది. జిల్లాలో ప్రత్యేక అధికారుల జాబితాను ఆఫీసర్లు సిద్ధం చేశారు. ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా అమలు చేయడంలో భాగంగా లిస్ట్‌ను రెడీ చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్ తీసుకొస్తే తప్ప.. పర్సన్ ఇన్‌చార్జీల పాలన కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు.

- లోక్‌సభ ఎన్నికల తర్వాతే స్థానిక పోరుకు మొగ్గు
- ప్రజలు ఆదరిస్తరనే నమ్మకం లేకనేనా..?
- ఈ నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, 3,666 వార్డులు ఉన్నాయి. చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు జనవరి ఒకటిన నోటిఫికేషన్ జారీ అయ్యింది. అదే నెల 21, 25, 30 తేదీల్లో మూడు దఫాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. 65మంది సర్పంచులు, 62మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెలాఖరున సర్పంచుల పదవీకాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం ఇందుకు సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదు. తాత్కాలికంగా వాయిదా వేసేందుకు మొగ్గు చూపుతున్నది. ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాదని స్వయంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అయితే ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాతే స్థానిక సంస్థలపై ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తున్నది.

ప్రత్యేక అధికారులు జాబితా సిద్ధం..!

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే జిల్లాలో ప్రత్యేక పాలన కోసం అధికారుల జాబితా సిద్ధం చేశారు. పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమించడానికి జిల్లా అధికారులు జాబితాను రెడీ చేశారు. మండల పరిషత్ సూపరింటెండెట్లు, ఎంఈఓలు, వ్యవసాయాధికారులు, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు, డిప్యూటీ తాసీల్దార్ల లిస్ట్ సిద్ధంగా ఉంచారు. ప్రత్యేక అధికారుల పాలనపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు, మార్గదర్శకాలు రాలేదని, ముందస్తుగా తయారు చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

ఆర్డినెన్స్‌తోనే పర్సన్ ఇన్‌చార్జీల పాలన..

కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం నిర్ణీత సమయంలో ఎన్నికలు నిర్వహించకపోతే ప్రత్యేక అధికారులను నియమించి.. పాలన కొనసాగించాలి. పర్సన్ ఇన్‌చార్జీలను కొనసాగించే అవకాశం లేదు. ఇప్పుడు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ చేయాలి. అది సాధ్యం కాకుంటే ఆర్డినెన్స్ తీసుకురావాల్సి ఉంటుంది. ఇప్పుడున్న సర్పంచులు, వార్డు సభ్యుల్లో అత్యధికం బీఆర్ఎస్ పార్టీకి చెందినే వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చట్ట సవరణ చేస్తుందా..? లేదా ఆర్డినెన్స్ తీసుకొస్తుందా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

గెలుపుపై నమ్మకం లేకనేనా..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు నెలలు కావస్తున్నది. అయితే అధికారంలోకి వచ్చిన తక్షణమే కొత్త పథకాలను అమలు చేస్తామని విస్తృతంగా ప్రచారం చేసింది. ముఖ్యంగా రైతుబంధు, రుణ మాఫీపై ప్రగల్భాలు పలికింది. రైతుబంధు డబ్బులు ఇంకా సగం మందికి కూడా బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. ఆరు గ్యారెంటీల పేరుతో దరఖాస్తులు తీసుకొని కాలయాపన చేస్తున్నది. ఇప్పుడున్న పథకాలు సక్రమంగా అమలు కావడంలేదు. ప్రభుత్వంపై జనంలో సానుకూల దృక్పథం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడే పంచాయతీ ఎన్నికలు వెళ్లితే జనం ఆదరిస్తారో లేదో అనే మీమాంసలో కాంగ్రెస్ ఉన్నట్లు కనిపిస్తున్నది. పంచాయతీ పోరులో ఫలితాల్లో తేడా వస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఎఫెక్ట్ పడే ఛాన్స్ ఉన్నది.

– యాదాద్రి భువనగిరి, జనవరి 25 (నమస్తే తెలంగాణ)

యాదగిరిగుట్ట ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీనృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జనవరి 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి గురువారం నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన చేసి ఆరగింపు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. స్వామి వారి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. సుమారు 9 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని ఆలయ ఖజానాకు రూ.16,84,008 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జెండా దిమ్మెకు రంగులు వేస్తున్న సిబ్బంది

గణతంత్ర వేడుకలకు సిద్ధం

- ముస్తాబైన భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం

భువనగిరి అర్బన్, జనవరి 25 : 75వ భారత గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వేడుకలకు అధికారులు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు కలెక్టరేట్‌లో, 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీస్ శాఖ, పాఠశాలల విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వస్తువుల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు జిల్లా ఉన్నతాధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఏర్పాట్లను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, ఏసీపీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు.

టీఎస్‌పీఎస్‌సీలో జిల్లావాసులకు చోటు

- సభ్యులుగా పాల్వాయి రజినీకుమారి, నర్రి యాదయ్య నియామకం

సూర్యాపేట, జనవరి 25 (నమస్తే తెలంగాణ)/సంస్థాన్ నారాయణపురం, జనవరి 25 : టీఎస్‌పీఎస్‌సీ సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పాల్వాయి రజినీకుమారి, సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి యాదయ్య నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీఓ విడుదల చేసింది. 1972 మే 6న నూతనకల్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి రాములు, భార్గవి దంపతులకు జన్మించిన రజినీకుమారి ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ పూర్తి చేశారు. తొలుత కొంతకాలం ప్రైవేట్ టీచర్‌గా పనిచేయగా, 2000 సంవత్సరంలో గ్రూప్-3 ద్వారా వీడీఓ ఉద్యోగం సాధించారు. తదనంతరం వీఓఆర్‌డీగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరం గ్రూప్-1కు ఎంపికై ఖైరతాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా, తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. 2004 వరకు విధులు నిర్వర్తించిన ఆమె.. అదే సంవత్సరం ఉద్యోగానికి రాజీనామా చేసి సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన ఆమె.. 2014లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. 2017లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరి స్పోక్స్‌పర్సన్‌గా పని చేశారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ మెంబర్‌గా ఎంపిక చేశారు.

నర్రి యాదయ్య

పాల్వాయి రజినీకుమారి

మారుమూల గ్రామం నుంచి జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ స్థాయికి నర్రి యాదయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి యాదయ్య ప్రస్తుతం జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామం మల్లారెడ్డిగూడేనికి చెందిన నర్రి దుర్గయ్య, మల్లమ్మ దంపతుల కుమారుడు యాదయ్య స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, సర్వేల్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివారు. మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, 1988లో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. 2000 సంవత్సరంతో జేఎన్‌టీయూ హెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 200 z6లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 1999లో యంగ్ సైంటిస్ట్ ఫెలోషిప్, 2015లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దాదాపు 31 సంత్సరాలు ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన.. ఎంసెట్, ఈసెట్‌కు రెండు సార్లు కన్వీనర్‌గా పనిచేశారు. 10 సార్లు రిక్రూట్‌మెంట్ పరీక్షల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. 10 మంది పీహెచ్‌డీ, 80 ఎంటెక్ ప్రాజెక్టులకు నిర్దేశకుడిగా పని చేశారు. ప్రొఫెసర్‌గా, యంగ్ సైంటిస్ట్‌గా ఎన్నో రివార్డు లు, అవార్డులు అందుకుని అంచెలంచెలుగా ఎదిగి పదోన్నతులు పొందిన నర్రి యాదయ్య టీఎస్‌పీఎస్‌సీ బోర్డు మెంబర్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బేతవోలు జడ్పీ పాఠశాలలో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఎంపిక

చిలుకూరు, జనవరి 25 : రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి ఇంటింటా ఇన్నోవేటర్-2024 అవార్డుకు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు చందా శ్రీనివాస్ ఎంపికయ్యారు. సూర్యరశ్మి సహాయంతో ఆహార పదార్థాలను ఆరబెట్టుకొనే యంత్రాన్ని తయారు చేసినందుకు గాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. తక్కువ ఖర్చుతో ఆహార పదార్థాలను పరోక్షంగా సూర్యరశ్మి సహాయంతో, ఎటువంటి రక్షణ అవసరం లేకుండా.. రంగు, రుచి, వాసన మరియు పోషక విలువలు పోగొట్టకుండా ఎండబెట్టుకోవడానికి ఈ పరికరం కనిపెట్టినట్లుగా శ్రీనివాస్ తెలిపారు. ఈ పరికరం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రయోగం ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. శ్రీనివాస్‌ను గురువారం స్థానిక పాఠశాలలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయయులు సన్మానించారు.

సైదన్న ఉర్సు షురూ

తొలిరోజు దట్టీలతో అలంకరణ.. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు

నేడు గంధోత్సవం.. తరలి రానున్న భక్తులు

విద్యుత్ వెలుగులో సర్వాంగ సుందరంగా దర్గా

పాలకవీడు, జనవరి 25 : మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల జాతరలో తొలిరోజు గుసూల్ షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున దర్గా పూజారి సయ్యద్ జానీ గృహం నుంచి మేళతాళాలతో గంధ కలశాలను, దట్టీలను తలపై ఎత్తుకొని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని హజ్రత్ సయ్యద్, మొహినుద్దీన్ షా, జాన్ పాక్ షహీద్ రహమతుల్లా అలై సమాధులతోపాటు బయట ఉన్న సైనిక సమాధులపై గంధం చల్లి, పూలమాలలు, దట్టీలతో అలంకరించారు. సమాధుల చుట్టూ మహిళలు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. దర్గాలో మగ్రీబ్ నమాజ్, ఈషాద్ నమాజ్‌లను దర్గా ముజావర్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గాకు వచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. సమీపంలో గల నాగదేవతకు మహిళలు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి.

నేడు ఉర్సే షరీఫ్

ఉర్సులో ప్రధాన ఘట్టం రెండో రోజు గంధోత్సవం (ఉర్సే షరీఫ్). గంధోత్సవానికి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. కోదాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు నలమాద ఉత్తమ్ పద్మావతి, బీఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సైతం రానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. అందుకు తగ్గట్లుగా వక్ఫ్ బోర్డు, జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు.

అలరించిన ఖవ్వాలి

ఉర్సు సందర్భంగా ఫకీరులు జాన్‌పహాడ్ దర్గాకు తరలివచ్చారు. ఈ సందర్భంగా దర్గా లోపల, బయట ఫకీరులు నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం అలరించింది. దట్టీల ఊరేగింపులో వీరి సందడి కనిపించింది.

భక్తులకు ఇబ్బంది లేకుండా..

గంధం ఊరేగింపునకు శుక్రవారం భక్తులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం జాన్‌పహాడ్ దర్గా వద్ద బందోబస్తు పర్యవేక్షించారు. నేరేడుచర్ల నుంచి వచ్చే వాహనాలను జాన్‌పహాడ్ గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద, దామరచర్ల నుంచి వచ్చే వాహనాలను శూన్యపహాడ్ రోడ్డులోని రైల్వే ట్రాక్ వద్ద, దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వైపు నుంచి వచ్చే వాహనాలను రావిపహాడ్ గ్రామానికి వెళ్లే దారిలోనే నిలిపివేయడానికి పోలీసు శాఖ చేసిన పార్కింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం జేపీఎస్ ఫంక్షన్‌హాల్‌లో పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి బందోబస్తుపై పలు సూచనలు ఇచ్చారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు. కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి వయా దామరచర్ల, నేరేడుచర్ల మీదుగా 30కి పైగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది.



దట్టీలు తీసుకొని వస్తున్న ముజావర్ కుటుంబం

జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, తదితరులు

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 25 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని గురువారం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఎంపీడీఓ కార్యాలయ వరకు నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో ఉద్యోగులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటును నమోదు చేసుకొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమైన ఓటును ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫామ్-6 ద్వారా ఓటు నమోదు, ఫామ్ - 8 ద్వారా మార్పులు చేసుకోవాలని సూచించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయని, ఈ సంవత్సరం చాలా ప్రత్యేకమైందని, ప్రపంచంలో 60 దేశాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో మన జిల్లా 90 శాతం ఓటింగ్‌తో మొదటి స్థానంలో ఉందని, ఓటర్లకు, ముఖ్యపాత్ర పోషించిన అన్ని రాజకీయ పార్టీల వారికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులంతా ఫామ్-18 ద్వారా తమ ఓటు నమోదు చేసుకోవాలని, ఎపిక్ కార్డు ఎక్కడ ఉంటే ఆ నియోజక వర్గంలో ఓటు హక్కు పొందాలని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, అన్వితారెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిధులు విడుదల

భువనగిరి అర్బన్, జనవరి 25 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న పథకం కింద రూ.1,85,21,685 ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు గుడ్ల కోసం రూ.36,96,240, వంట సామగ్రి కోసం రూ.90,74,425, 9 నుంచి పదో తరగతి వరకు వంట సామగ్రి కోసం రూ.27,82,000, వంట చేసే వారి గౌరవ వేతనం రూ.1,85,21,685 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 659 పాఠశాలలు ఉండగా ఈ నిధులు వాటికి అందనున్నాయి.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ

నల్లగొండ రూరల్, జనవరి 25 : కొలతలు, తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని శివం, డాల్ఫిన్, సాయి కేక్స్ అండ్ బేక్స్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెడ్ ప్యాకెట్లపై తయారైన అడ్రస్, నిల్వ ఉండాల్సిన తేదీ, కస్టమర్ కేర్ చిరునామా, ఫోన్ నెబర్, ఇతర వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. సాయి కేక్స్ బేక్స్, డాల్ఫిన్ బేకరీల్లో కిలో కేక్‌కు 150 గ్రాములు తక్కువ ఉన్నట్లు గుర్తించి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ బేకరీల నిర్వాహకులు సరైన తూకం పాటించాలని, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను విధిగా డిపార్టుమెంట్ వారితో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.